సంక్షిప్తంగా..

■ **అడ్‌హాక్ కమిటీ ఎన్నిక..** డిచ్‌పల్లి, ఏప్రిల్ 2 : అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ (ఏటీయూటీ) నూతన అడ్‌హాక్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంట చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా అపర్ణ, ఉపాధ్యక్షులుగా సంపత్ కుమార్, వాణి, జాయింట్ సెక్రటరీలుగా ఆంజనేయులు, సుధాకర్, ట్రెజరీగా అతీక్ సుల్తాన్ గోరీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆరతి, రవీందర్‌రెడ్డి, లావణ్య, రాంబాబు ఎన్నికయ్యారు.

■ **నోటిఫికేషన్ రద్దు చేయాలి..** డిచ్‌పల్లి, ఏప్రిల్ 2 : నిబంధనలకు విరుద్ధంగా జారీచేసిన తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరిని అధ్యాపకులు మంగళవారం కోరారు. ఐదేండ్లుగా కనీసం సభ్యత్వాలు చేపట్టకుండా మనుగడలో లేనందున టూటా రద్దయినట్లు పరిగణించాలన్నారు.

■ **నేడు సర్వసభ్య సమావేశం..** సిరికొండ, ఏప్రిల్ 2 : ఎంపీపీ మలావత్ సంగీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

■ **ఉపాధ్యాయుడికి సన్మానం..** కోటగిరి, ఏప్రిల్ 2: పొతంగల్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన కొల్లూర్ వెంకటసుబ్బారావు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయనను బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ **కట్టెల కోసం వెళ్లి బాలుడి అదృశ్యం..** వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: రూరల్ ఠాణా పరిధిలోని గూపన్‌పల్లి గ్రామానికి చెందిన చెన్నయ్య డానియల్ అనే బాలుడు 18 రోజుల క్రితం కట్టెల కోసం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేశ్ తెలిపారు.

■ **మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య..** డిచ్‌పల్లి, ఏప్రిల్ 2: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మచ్చ ప్రవీణ్(40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఇంటిపక్కన ఉండే మల్లుబాయి కుటుంబంతో గొడవ కావడంతో అందరి ముందు తన పరువు పోయిందని మనస్తాపంతో ప్రవీణ్ సోమవారం రాత్రి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మల్లుబాయిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

■ **డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 3 రోజుల జైలు..** వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: నగరంలోని ఒకటో ఠాణా పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఒకరికి సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మంగళవారం మూడు రోజుల జైలుశిక్ష విధించారని ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

పోలింగ్ విధులపై పూర్తి అవగాహన ఉండాలి

■ **పీవో, ఏపీవోల శిక్షణ తరగతులను పరిశీలించిన కలెక్టర్**

కంఠేశ్వర్, ఏప్రిల్ 2: పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఎలాంటి సందేహాలున్నా శిక్షణలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. శిక్షణలో అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నియమావళికి అనుగుణంగా పొరపాట్లకు తావులేకుండ పక్కాగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశాక తిరిగి పోలింగ్ పూర్తయిన తర్వాత తిరిగి అప్పజెప్పడంతోపాటు పోలింగ్ ఏజెంట్లకు అన్ని విధాలా సమాధానం చెప్పాల్సిన బాధ్యత పీవోలదేనని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ అధికారుల శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

చికిత్సతోనే పిల్లల్లో ఆటిజం లక్షణాలు తగ్గుముఖం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 2: చిన్నపిల్లల్లో మానసిక సమస్యలు, బుద్ధిమాంద్యం, ఎక్కువగా మాట్లాడడం లేదంటే మాట్లాడకపోవడం వంటివి ఆటిజం లక్షణాలని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు ఆకుల విశాల్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొట్టూర్ శ్రీశైలం అన్నారు. వీటిని త్వరగా గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆటిజం తగ్గించవచ్చని తెలిపారు. నగరంలోని స్నేహ సొసైటీ దివ్యాంగ పాఠశాల, ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్, మెంటల్ హెల్త్ కమిటీ ఆధ్వర్యంలో వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అలాగే ద్వారకానగర్‌లోని హెచ్‌పీఎస్ కిడ్స్, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ.. ఆటిజం బారిన పడిన పిల్లల్లో ఉండే లక్షణాలు, అందుకు గల కారణాలను తల్లిదండ్రులకు వివరించారు. త్వరలోనే శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని పీడీ రసూల్‌బీ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో దివ్యాంగ పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఐఎంఏ సిబ్బంది రాజేంద్రప్రసాద్, నేతి బాలేశ్, నవీన్‌రెడ్డి, చతుర, హెపీఎస్ కిడ్స్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణుడు విశాల్

పిల్లలతో వైద్యులు శ్రీశైలం, బాలేశ్ తదితరులు

భారీగా నగదు, బంగారం పట్టివేత

వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా నగదు, బంగారం పట్టుబడింది. కుమార్ గల్లీ ప్రాంతంలో సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టగా నాందేవ్‌వాడ ప్రాంతానికి చెందిన గంగాప్రసాద్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 6లక్షల 89వేల 500 నగదు, 400 గ్రాముల బంగారు బిస్కెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వాటిని సీజ్ చేసి ట్రెజరీ అధికారులకు అప్పగించామన్నారు.

గ్రామస్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఇందల్వాయి, ఏప్రిల్ 2 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండదెబ్బ, వడగాడ్పుల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య విస్తీర్ణాధికారి అక్బర్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ 'ఉపాధి' కల్పించాలి

ధర్పల్లి, ఏప్రిల్ 2 : ప్రతి గ్రామంలో కనీసం 175 మందికి ఉపాధి పని కల్పించాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. మండలంలోని కోటాన్‌పల్లి, సీతాయిపేట్ గ్రామాల్లో మంగళవారం పర్యటించి ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎఫ్ఏలు, టీఏలు పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట ఏపీవో వినోద ఉన్నారు.

బాజిరెడ్డిని కలిసిన మహిళా నాయకులు

ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో మహిళా నాయకులు

సారంగాపూర్, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను పలువురు మహిళా నాయకులు నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి బీఆర్ఎస్ గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం చేయాలని ఈ సందర్భంగా బాజిరెడ్డి కోరారు. ఆయనను కలిసిన వారిలో గీతారాణి, స్వప్న, బుచ్చమ్మ, ముంతాజ్‌బేగం ఉన్నారు.

విద్యార్థులకు ఉచితంగా వేసవి శిక్షణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 2: విపంచి సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నగరంలోని జనార్దన్ గార్డెన్‌లో ఉచితంగా ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకురాలు గిరిజాగాయత్రీ తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు నృత్యం, సంగీతం, చిత్రకళ, నీతికథలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగుతుందని ఆసక్తిఉన్నవారు 9440338370 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

పిల్లలకు శిక్షణ ఇస్తున్న గిరిజాగాయత్రీ

మోపాల్ మండలంలోని ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గోరోజైన మంగళవారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు కొనసాగాయి. వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, సినీ నిర్మాత శిరీశ్, సినీ హీరో ఆశిష్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. – ఖలీల్‌వాడి, ఏప్రిల్ 2

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీ

కంఠేశ్వర్, ఏప్రిల్ 2: బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ రైతులు, కార్మికులను రోడ్డున పడేస్తున్నదని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లధనం వెలికితీసి పేదలకు పంచుతామన్న మోదీ.. నోట్ల రద్దుతో వైట్‌మనీగా మార్చుకునే అవకాశం కల్పించిందన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తే సోమరులవుతారంటూనే బడా వ్యాపారుల రుణాలను ఎందుకు మాఫీ చేశారని ప్రశ్నించారు. పసుపు బోర్డు జీవో ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఏర్పాటు చేయకుండా రైతులను మోసం చేశారని మండిపడ్డారు.

ప్రతి నెలా మొదటి బుధవారం
సైబర్ జాగృక్త దివస్
ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే : సీపీ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 2: సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆదేశాల మేరకు 'సైబర్ జాగృక్త దివస్' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని సీపీ కల్మేశ్వర్ మంగళవారం వెల్లడించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహిస్తామని తెలిపారు. మరింత సమర్థవంతంగా సేవ లందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతున్నదన్నారు. సైబర్ మోసానికి గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. 'సైబర్ జాగృక్త దివస్'లో భాగంగా నేడు (బుధవారం) అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొలి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. హోటల్ బుకింగ్స్, పెట్టుబడులు తదితర మోసాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

స్పందించారు.. మరమ్మతులు చేయించారు..

భీమ్‌గల్, ఏప్రిల్ 2: మండలంలోని బడాభీమ్‌గల్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైంది. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో మార్చి 30న 'మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. మంగళవారం గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సంతోష్ కుమార్ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను ప్రారంభించారు. సమస్య పరిష్కారమైనందుకు గ్రామస్తులు 'నమస్తే తెలంగాణ'కు ధన్యవాదాలు తెలిపారు.

వృథాగా ఉర్దూ ఘర్..

■ కొన్నేళ్లుగా నిరుపయోగంగా భవనం
■ అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న స్థానికులు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 2: బోధన్ పట్టణంలోని రైల్వే గేట్ సమీపంలో నిర్మించిన ఉర్దూఘర్ వృథాగా మారింది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ భవనాన్ని చిన్నపాటి ఫంక్షన్లు, ప్రభుత్వపరంగా నిర్వహించే పలు శిక్షణా కార్యక్రమాలకు గతంలో వినియోగించేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వల్ప మరమ్మతులు సైతం చేయించారు. పక్కనే ఓ షెడ్డును ఏర్పాటు చేసి రేకులు వేయాల్సి ఉండగా నిలిపివేశారు. గతంలో భవనంలోకి వెళ్లేందుకు గేట్ తోపాటు ఉర్దూ ఘర్ అని ఏర్పాటు చేసిన బోర్డు కూడా కనిపించకపోవడం గమనార్హం. ఉర్దూఘర్‌ను ఎవరూ పట్టించుకోకపోవడంతో కొందరు వ్యాపారులు భవనం వెనుక భాగాన్ని, ముందర భాగాన్ని తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఫంక్షన్‌హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన జనరేటర్ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేయించి కనీస వసతులు కల్పిస్తే చిన్నపాటి ఉత్సవాలతో పాటు పలు కార్యక్రమాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి ఉర్దూఘర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారులకు నివేదించాం..

ఉర్దూ ఘర్ వినియోగించడం లేదనే విషయం మా దృష్టికి వచ్చింది. ఎన్నికల కోడ్ కారణంగా ప్రస్తుతం మేము బిజీగా ఉన్నాం. ఎన్నికల కోడ్‌కు ముందుగానే మైనార్టీ వెల్ఫేర్ అధికారికి సూచించాం. ఎన్నికల అనంతరం ఉర్దూఘర్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. –గంగాధర్, బోధన్ తహసీల్దార్

సంక్షిప్తంగా..

■ **బాల్య వివాహాలపై అవగాహన:** భీమ్‌గల్, ఏప్రిల్ 2 : మండలంలోని ఎండీ తండా, రూప్లాతండా, చౌడతండా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు బాల్య వివాహాలు– కలిగే నష్టాలు, బాలల హక్కులు– చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించినట్లు సీడీపీవో స్వర్ణలత మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, బాబు, జ్యోత్స్న, స్రవంతి, ముజాహిద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ **నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలి:** ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విష్ణేష్ అన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 5వ డివిజన్ మహాసభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విష్ణేష్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు.

■ **గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన:** భీమ్‌గల్, ఏప్రిల్ 2: మండలంలోని బడాభీమ్‌గల్ పెద్దమ్మకాడి తండా, సికింద్రాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో సంతోష్‌కుమార్ మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్యపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. నీటి ట్యాంకులను పరిశీలించారు. బడాభీమ్‌గల్‌లో డ్రైనేజీ పనులను తనిఖీ చేసి పెద్దమ్మకాడి తండా నర్సరీ సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సికింద్రాపూర్‌లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శితో సమీక్ష నిర్వహించారు.

■ **నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలి:** ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 2: నిజాంసాగర్ కాలువకు గండిపడి పట్టణంలోని జర్నలిస్టు కాలనీలోకి నీరు చేరడంతో పలు కుటుంబాలు నష్టపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆర్మూర్ సంయుక్త మండలాల కమిటీ ఆధ్వర్యంలో నిజాంసాగర్ కాలువ కట్టను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన వారికి పరిహారం కింద రూ. 20 వేలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవారాం, ముత్తెన్న, కిషన్, నరేందర్, శేఖర్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

■ **88శాతం పన్ను వసూలు:** ఏర్గట్ల, ఏప్రిల్ 2 : మండల వ్యాప్తంగా ఈ ఏడాది 88శాతం ఇంటి పన్ను వసూలు చేశామని ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను వసూలు కోసం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో మండలంలోని తొర్తి, తడ్‌పాకల్, నాగేంద్రనగర్, గుమ్మిర్యాల్ గ్రామాల్లో వంద శాతం పన్ను వసూలు కాగా.. బట్టాపూర్, దోంచంద, తాళ్ల రాంపూర్, ఏర్గట్ల గ్రామాల్లో 90శాతం పైనే పన్ను వసూలైనట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం రూ. 88 లక్షల బకాయిలు ఉండగా రూ. 84లక్షలు వసూలైనట్లు వారు తెలిపారు.

■ **బషీరాబాద్‌లో పోలీసు కళాజాత :** కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని బషీరాబాద్ గ్రామంలో సీపీ కల్మేశ్వర్ సింగనవర్ ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మహిళల భద్రతకు షీ టీమ్ రక్షణ కల్పిస్తున్నదని తెలిపారు. అత్యవసర సమయాల్లో 100 నంబర్‌కు డయల్ చేయాలని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారు అప్రమత్తంగా ఉండాలన్నారు.

■ **ఎనిమిది మంది గ్రామస్తుల రిమాండ్:** నవీపేట,ఏప్రిల్ 2: మూతపడిన రైస్‌మిల్‌లో చోరీకి పాల్పడిన దొంగ బానవత్ సునీల్ మృతికి కారణమైన పాల్దా గ్రామానికి చెందిన లచ్చన్న, దేవన్న, నరేశ్, ప్రభాకర్, అశోక్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్ తెలిపారు. సునీల్ బంధువుల ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

■ **అధికారికంగా నిర్వహించాలి:** శక్కర్‌నగర్, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని పలువురు గౌడ సంఘ నాయకులు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. మొగలులకు వ్యతిరేకంగా పోరాటం చేసి, సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన గొప్ప యోధుడు సర్వాయిపాపన్న అని పేర్కొన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

జాతీయ నాయకుల చిత్రపటాల అందజేత

వేల్పూర్, ఏప్రిల్ 2 : మండలంలోని కుకునూర్ జడ్పీహెచ్ఎస్‌కు అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పతాని సురేందర్ (జడ్పీహెచ్ఎస్–చేపూర్) జాతీయ నాయకుల చిత్రపటాలను మంగళవారం బహూకరించారు. వాటిని పాఠశాల హెచ్ఎం హరిచరణ్‌కు అందజేయగా.. సురేందర్‌ను పాఠశాల తరపున ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు, శ్రీధర్‌రావు, మోహన్, రవీందర్, శ్రీనివాస్, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

మాక్లూర్‌లో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ప్రారంభమవగా.. మంగళవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. – మాక్లూర్, ఏప్రిల్ 2

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి
బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్

బోధన్, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వర్తించే ప్రతి అధికారి ఎన్నికల కమిషన్ ఆదేశాలు తప్పక పాటించాలని ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ సూచించారు. బోధన్ పట్టణ శివారులోని ఇందూర్ బీఈడీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు కొనసాగుతున్న శిక్షణలో భాగంగా రెండో రోజైన మంగళవారం ఆర్డీవో హాజరై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల బాధ్యతలు ఎంతో కీలకమైనవని తెలిపారు. ప్రతి అధికారి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పాస్‌పోర్టుతో ఖతార్‌కు..
ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డ మోర్తాడ్‌వాసి

మోర్తాడ్, ఏప్రిల్ 2: మండలంలోని దొన్కల్ గ్రామానికి చెందిన సాయి అనే వ్యక్తి నకిలీ పాస్‌పోర్టుతో ఖతార్‌కు వెళ్తుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సోమవారం భద్రతాధికారులకు పట్టుబడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయి దాదాపు 15 ఏండ్లుగా ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్తుండగా.. మూడేండ్ల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో మళ్లీ గల్ఫ్‌కు వెళ్లడానికి నిశ్చయించుకున్నాడు. సాయి వయస్సు 50 ఏండ్లు దాటడంతో వీసా రాదని తెలుసుకొని ఓ ఏజెంట్ ద్వారా నకిలీ ధ్రువపత్రాలతో వయస్సు తక్కువగా ఉన్నట్లు మరో పాస్‌పోర్టు తీసుకున్నాడు. దాని ద్వారా ఖతార్ వీసా తెప్పించుకుని వెళ్లేందుకు సిద్ధమైన క్రమంలో ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులకు దొరికిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారం కోసం వెళ్లి మృత్యు ఒడికి..

■ జగ్గారావు ఫారం వద్ద రోడ్డు ప్రమాదం
■ చెట్టుకు ఢీకొన్న కారు.. అక్కడికక్కడే మహిళ మృతి
■ నలుగురికి తీవ్రగాయాలు.. జిల్లా దవాఖానకు తరలింపు

సులోచన (ఫైల్)

నవీపేట, ఏప్రిల్ 2: నవీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగ్గారావు ఫారం వద్ద బాసర రోడ్డుపై ఓ కారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొనగా ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా.. నలుగురికి గాయాలైనట్లు ఎస్సై యాదిగిరి గౌడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కోటగల్లికి చెందిన కారు యజమాని సుదర్శన్, అతని భార్య సులోచన (52)తోపాటు కవిత, అనిత, శారద మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు కారం పొడి పట్టించు కోవడానికి మంగళవారం ఉదయం కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నవీపేట మండలం జగ్గారావు ఫారం వద్ద కారు అదుపు తప్పి చెట్టుకు బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సులోచన అక్కడికక్కడే మృతి చెందగా మిగతావారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో జిల్లా దవాఖానకు తరలించారు. సులోచన కుమారుడు కౌముది మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్